# సంపాదకీయం

## వికసిత్ భారత్ - సమగ్ర అభివృద్ధికి మనందరి పాత్ర

భారతదేశం 77 ఏళ్ల స్వాతంత్ర్యాన్ని పూర్తి చేసుకున్న ఈ తరుణంలో, మనం గడిచిన దశాబ్దాలను?పించి, భవిష్యత్తు దిశగా ముందుకు సాగాల్సిన అవసరం ఉంది. 1947లో స్వాతంత్ర్యం పొందినప్పటి నుంచి భారతదేశం అనేక మార్పులను ఎదుర్కొంటూ, ప్రపంచవ్యాప్తంగా ఒక శక్తివంతమైన దేశంగా ఎదిగింది. ఈ ప్రయాణంలో, అభివృద్ధి ప్రధాన లక్ష్యంగా మారింది. కానీ, ఈ అభివృద్ధి సమాజంలోని ప్రతి ఒక్కరికీ చేరిందా? అన్న ప్రశ్నను మనం ఆలోచించాల్సిన అవసరం ఉంది.

భారతదేశం నేడు ఆర్థిక, సాంకేతిక, వైద్య, వ్యవసాయ, అంతరిక్ష పరిశోధన తదితర రంగాల్లో అపూర్వమైన పురోగతి సాధించింది. అంతర్జాతీయ వాణిజ్యం, రక్షణ, పరిశ్రమల వృద్ధితో భారతదేశం విశ్వమార్గదర్శిగా నిలుస్తోంది. కానీ, ఈ అభివృద్ధి సమస్త భారతీయుల జీవితాల్లో ప్రతిఫలించిందా? దేశంలోని ప్రతిఒక్కరు దీని ప్రయోజనాలను అనుభవిస్తున్నారా? అనేదే మన ముందున్న సవాల్.

**వికసిత్ భారత్ -ప్రభుత్వాలు మాత్రమే కాదు, ప్రజల బాధ్యత కూడా**

దేశాభివృద్ధి బాధ్యత కేవలం ప్రభుత్వాలదే కాకుండా, ప్రతి పౌరుడి బాధ్యత కూడా. అభివృద్ధి లక్ష్యం ప్రభుత్వ విధానాల పరిమితిలో ఉండకూడదు. సమాజంలోని అసమానతలను తొలగించి, ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు కల్పించడమే అసలైన వికాసం. విద్య, వైద్యం, ఉపాధి, ఆహార భద్రత వంటి అంశాల్లో దేశం గొప్ప పురోగతి సాధించినప్పటికీ, ఇవి ఇంకా కొంతమందికి మాత్రమే పరిమితం కావడం ఆందోళన కలిగించే అంశం.ప్రజలు అభివృద్ధి చెందాలంటే, ఆహార భద్రత కీలకమైన అంశం. 1950ల కరువు పరిస్థితుల నుంచి, నేడు 140 కోట్ల మందికి సరిపడే ఆహారాన్ని ఉత్పత్తి చేసే స్థాయికి మనం ఎదిగాం. అంతేకాదు, ఇతర దేశాలకు కూడా ఆహార సహాయం అందించే స్థాయికి చేరుకున్నాం. కానీ, ఈ ప్రగతితో పాటు పర్యావరణానికి కలిగిన నష్టం అనివార్యంగా మారింది. మట్టిలో పోషక విలువలు తగ్గడం, నీటి వనరుల అధిక వినియోగం వంటి సమస్యలు పరిష్కరించాల్సిన అవసరం ఉంది. దీని కోసం పర్యావరణహిత వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించాలి.

**భారతదేశం - ప్రపంచానికి మార్గదర్శి**

భారతదేశం భౌతికంగా అభివృద్ధి చెందడమే కాకుండా, మిగతా ప్రపంచానికి మార్గదర్శిగా నిలవాలి. మనదేశానికి ఉన్న సాంస్కృతిక, జ్ఞాన పరంపర ఇతర దేశాలకు ఆదర్శంగా మారాల్సిన సమయం ఇది. నేడు శాస్త్ర, సాంకేతిక, వైద్య రంగాల్లో భారతదేశం సాధించిన ప్రగతి అంతర్జాతీయంగా మన గౌరవాన్ని పెంచింది. ఈ విజయాలను మరింత విస్తరించేందుకు, దీర్ఘకాలిక ప్రణాళికలతో ముందుకు సాగాలి.

**వికసిత్ భారత్ - సమష్టి లక్ష్యం**

భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాకారం చేసేందుకు, ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత తీసుకోవాలి. అభివృద్ధిలో భాగస్వామ్యం కావడానికి ఇదే సరైన సమయం. 77 ఏళ్ల స్వాతంత్ర్య ప్రయాణాన్ని గౌరవించేందుకు, భారతదేశ భవిష్యత్‌ను మరింత ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు మనందరం కలిసి కృషి చేయాలి. భారతదేశ అభివృద్ధి మరింత సమగ్రంగా, స్థిరంగా కొనసాగాలి. సామాజిక న్యాయం, సమాన అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగితేనే, నిజమైన వికసిత్ భారత్ ను నిర్మించగలం. మనందరం కలిసికట్టుగా పని చేద్దాం, వికసిత్ భారత్ నిర్మాణంలో భాగస్వాములం అవుదాం!

వ్యాసకర్త
చెరుకు జంగయ్య గౌడ్



## పాఠకులకు గమనిక:




మీరు ఎదుర్కొంటున్న సమస్యలను వివరణాత్మకంగా మాకు తెలియజేయండి. ప్రభుత్వ అధికారుల మరియు ప్రజల మధ్య వారధిగా నిలిచి, మా ప్రత్యేక విలేకరుల బృందం సంబంధిత అధికారులను సంప్రదించి, పరిష్కారం కోసం కృషి చేస్తుంది.

మమ్మల్ని సంప్రదించడానికి:
ఇమెయిల్: neelagiriexpress@gmail.com
సంప్రదింపు నెంబర్: 9705770909

మీ ప్రతిభావంతమైన భాగస్వామ్యంతో సమాజానికి మంచి మార్పు తీసుకురావడం మా లక్ష్యం.

మీ గొంతుకకు మేమే వేదిక - నీలగిరి ఎక్స్‌ప్రెస్!

## వైభవంగా శ్రీశ్రీశ్రీ వేణుగోపాల స్వామి రుక్మిణి సత్యభామ కళ్యాణం

-స్వామివారి కల్యాణంలో పాల్గొన్నడిసిసిబి డైరెక్టర్ గంప వెంకటేష్ గుప్తా
-కళ్యాణాన్ని తిలకించేందుకు పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులు



**కడ్తాల్,మార్చి 5(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కడ్తాల మండల పరిధిలోని చరికొండ గ్రామంలో అతి పురాతనమైన దేవాలయంలో శ్రీశ్రీశ్రీ వేణుగోపాలస్వామి రుక్మిణి సత్యభామ సమేత కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కళ్యాణాన్ని ఆలయ వేద పండితులు శ్రీనివాసచారి ఆధ్వర్యంలో వేద మంత్రోచ్ఛరణల మధ్య భక్తిశ్రద్ధలతో జరిపించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ అభివృద్ధి కమిటీ వచ్చే భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు చేశారు. ఈ కళ్యాణాన్ని తిలకించేందుకు డిసిసిబి డైరెక్టర్ ఆమనగల్లు సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా, రైతు సమన్వయ సమితి జిల్లా మాజీ సభ్యులు బాచిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కడ్తాల్ మాజీ ఉపసర్పంచ్ కడారి రామకృష్ణ, చరికొండ మాజీ సర్పంచ్ లాల్కోట భారతమ్మ నరసింహ గౌడ్, మాజీ ఎంపిటిసి అద్దాల రాములు, రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షులు జోగు వీరయ్య, చరికొండ మాజీ ఉపసర్పంచ్ నరేష్, లు హాజరై స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుండి ప్రజలు మహిళలు పెద్ద ఎత్తున హాజరై స్వామివార్ల కళ్యాణాన్ని కనులారా తిలకించారు. అనంతరం గ్రామానికి చెందిన సిద్ధమోని అఖిల, సిద్ధమోని నరేందర్, సిద్ధమోని నరేష్ అన్న ప్రసాద కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కరుణాకర్ సెట్, భీష్మ చారి, లాల్కోట జంగయ్య, గోపాల్, సాబేర్, దర్గయ్య, తదితరు పాల్గొన్నారు.

## టీఎస్ఎస్ఓ ఆధ్వర్యంలో ఘనంగా ఎస్ఎస్సి టాలెంట్ టెస్ట్ బహుమతుల ప్రధానోత్సవం



**ఆమనగల్, మార్చి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఆమనగల్ పట్టణంలోని మానస గార్డెన్ లో టీఎస్ఎస్ఓ రాష్ట్ర కోఆర్డినేటర్ కర్రే సుదర్శన్ ఆధ్వర్యంలో ఎస్ఎస్సి టాలెంట్ టెస్ట్ బహుమతుల ప్రధానోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీనియర్ జర్నలిస్ట్ శ్రీదేవి హాజరై, విద్యార్థులకు భవిష్యత్తు లక్ష్యాల సాధన కోసం కష్టపడి చదవాలని, రాబోయే పదవ తరగతి పరీక్షలను ప్రశాంతంగా రాయాలని ప్రోత్సహించారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులకు గౌరవం మరియు స్కూల్ కు పేరు తీసుకురావాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో సంఘసేవకులు పాపిశెట్టి రాము, ఎంఈఓ, టీఎస్ఎస్ఒ రాష్ట్ర అధ్యక్షుడు మీసాల లక్ష్మీనివాస్, తెలంగాణ విద్యార్థి జేఏసీ చైర్మన్ ఆమనగల్లు రాజు, ట్రస్మా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అల్లాజీ గౌడ్, సెన్సార్ బోర్డు సభ్యుడు చంద్రశేఖర్, తెలంగాణ యూనియన్ ఫిలిం డాన్సర్ ప్రభుశంకర్, జేఏసీ కన్వీనర్ అవ్వారి శివలింగం తదితరులు పాల్గొన్నారు.

విజేతల వివరాలు
**మొదటి బహుమతి:** క్రిస్టినా శారోన్ (లిటిల్ స్కాలర్ టెక్నో స్కూల్)
**రెండవ బహుమతి:** శ్రీ వైష్ణవి (వివేక విద్యాభారతి)
**మూడవ బహుమతి:** వి. లహరి (బ్రిలియంట్ గ్రామర్ హై స్కూల్)

ఉపాధ్యాయులు శర్మ, మహమూద్, శ్రీశైలం, మీసాల చిక్కి, శివ, సాయి, ధనుష్, శివరాజ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు. టాలెంట్ టెస్ట్ లాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో స్ఫూర్తి నింపడమే కాకుండా, వారి విజయానికి కీలకం అని ముఖ్య అతిథులు అభిప్రాయపడ్డారు.

## దేవరకొండ నియోజకవర్గ వ్యాప్తంగా ఉచిత కంటి వైద్య శిబిరాలు



**దేవరకొండ,మార్చి 5(నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
డిండి మండలం దాసరి నెమలిపురి గ్రామంలో ఉచిత వైద్య శిబిరం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. లయన్స్ క్లబ్ ఉన్నంతవరకు కంటి సమస్యలతో ఏ ఒక్కరూ ఇబ్బందులు ఎదుర్కోకూడదనే ఉద్దేశంతో నియోజకవర్గ వ్యాప్తంగా ఉచిత కంటి వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామని లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ వస్కుల సత్యనారాయణ అన్నారు. డిండి మండలం దాసరి నెమలిపురి గ్రామంలో జాతర పురస్కరించుకొని ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరం లో 200 మందికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

## డబుల్ బెడ్రూం కాలనీలో మంచినీటి సమస్యను పరిష్కరిస్తా

**-వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**

**వనపర్తి,మార్చి 5( నీలగిరి ఎక్స్ ప్రెస్):**
వనపర్తి జిల్లా కేంద్రంలోని చిట్యాల రోడ్డులో ఉన్న ఆదర్శ డబుల్ బెడ్రూం కాలనీలో నెలకొన్న మంచినీటి సమస్యను పరిష్కరిస్తానని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి హామీ ఇచ్చారు. కాలనీలో నెలకొన్న మంచినీటి సమస్యపై కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు బుధవారం ఎమ్మెల్యేను ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా కాలనీలో నీటి సమస్య తీవ్రంగా ఉందని, కాలనీ ప్రజలు మంచినీటి కోసం నిత్యం ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. వేసవికాలం రావడంతో కాలనీ ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని వెంటనే బోర్లు వేయించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే మున్సిపల్ కమిషనర్ తో ఫోన్లో మాట్లాడారు. డబుల్ బెడ్రూం కాలనీలో మిషన్ భగీరథ నీళ్లు, బోర్ల ద్వారా వాడుకుంటున్న నీళ్ల గురించి కాలనీకి వెళ్లి విచారణ చేసి తమకు సమాచారం ఇవ్వాలని ఎమ్మెల్యే ఆదేశించారు. కాలనీలో మంచినీటి సమస్య రాకుండా చూస్తానని ఎమ్మెల్యే కమిటీ సభ్యులకు హామీ ఇచ్చారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ ను కాలనీ అభివృద్ధి కమిటీ నాయకులు ఫోన్లో సంప్రదించగా గురువారం కాలనీకి వచ్చి మంచినీటి సమస్యను పరిశీలించి పరిష్కారం చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు మండ్ల రాజు, గోపాలకృష్ణ, జర్నలిస్ట్ నిరంజన్, తిరుపతి, జమ్మూ, సాయిలీల, బలరాం వెంకటేష్, విష్ణు సాగర్, వినోద్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు



## అంజిరెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన బీజేపీ నేత శ్రీ వర్ధన్ రెడ్డి

**షాద్ నగర్, మార్చి 5(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
: కరీంనగర్, మెదక్, నిజామాబాద్, అదిలాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించిన అంజిరెడ్డిని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నెల్లి శ్రీ వర్ధన్ రెడ్డి ఫోన్ ద్వారా అభినందించారు. ఈ సందర్భంగా, అంజిరెడ్డి తన అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ, జిహెచ్ఎంసి ఎన్నికల ముందు బీజేపీలోకి చేరిన సందర్భాన్ని ప్రస్తావించారు. గతంలో టీచర్ ఎమ్మెల్సీగా పోటీ చేసినప్పుడు వర్ధన్ రెడ్డి ఇచ్చిన సలహాలు, సూచనలు ఈ ఎన్నికల్లో విజయానికి దోహదపడ్డాయని తెలిపారు. అంజిరెడ్డి ఈ విజయానికి అందించిన సహాయ సహకారాలను ఎప్పటికీ మరచిపోలేనని, ఈ విజయంతో తనకు ఎంతో సంతోషం కలిగిందని పేర్కొన్నారు. ఈ సంభాషణ బీజేపీ నాయకత్వంలోని అనుబంధాలను మరింత బలపరిచింది.

# చెట్టు = అమ్మ
# చెత్త = రోగం

చెట్టు మన జీవితానికి అమ్మంత ప్రాముఖ్యమైనది. అది మనకు ప్రాణవాయువును అందిస్తుంది, ప్రకృతిని సంరక్షిస్తుంది, మన శ్రేయస్సుకు తోడ్పడుతుంది. చెట్టు ఉంటే జీవితం ఉందని చెప్పడం అసత్యం కాదు. మరోవైపు, చెత్త అనేది రోగాలకు కారణమవుతుంది. చెత్త ఎక్కడైతే పేరుకుపోతుందో అక్కడ పర్యావరణం కలుషితమవుతుంది, నీరు, గాలి, నేల నాశనం అవుతాయి.

**చెట్టు ఎలా అమ్మలా ఉంటుంది:**
-మనకు ఆక్సిజన్ అందిస్తుంది.
-నీడ, చల్లదనం, ఆహారం, చెక్క, ఔషధాలు అందిస్తుంది.
-ప్రకృతి మనుగడలో కీలక పాత్ర పోషిస్తుంది.

**చెత్త ఎలా రోగంగా మారుతుంది:**
-చెత్త పేరుకుపోతే దోమలు, చీమలు, బ్యాక్టీరియా పుట్టుక.
-కాలుష్యం వల్ల శ్వాసకోశ, నీరు మరియు ఆహారానికి సంబంధించిన రోగాలు.

చెట్టు మన జీవితానికి అమ్మవంటిది. అందుకే మనం చెట్లను నాటాలి, వాటిని కాపాడాలి.
చెత్త మన జీవనానికి రోగం. అందుకే చెత్తను తగ్గించాలి, పునర్వినియోగం చేయాలి, పర్యావరణాన్ని స్వచ్ఛంగా ఉంచాలి.

"ప్రకృతిని ప్రేమిద్దాం, జీవనాన్ని కాపాడుకుందాం!"
మీ నరేష్ దండు సామాజిక కార్యకర్త

# చేవెళ్ల ఎస్సీ ఎస్టీ డిక్లరేషన్ అమలు చేయాలని పులిజాల పరశురాములు డిమాండ్




**కల్వకుర్తి, మార్చి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కల్వకుర్తి పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన డివిజన్ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి పులిజాల పరశురాములు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా, ఆయన తక్షణమే అంబేద్కర్ అభయహస్తం మార్గదర్శకాలను ప్రకటించాలని, ఏప్రిల్ మాసాన్ని పూర్తిగా మహనీయుల మాసంగా గుర్తించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చేవెళ్ల డిక్లరేషన్‌లో పేర్కొన్న విధంగా ఏడాదికి రూ. 750 కోట్లు కేటాయించి, రైతుబంధు, రైతు బీమా, వసతి కల్పన వంటి హామీలను అమలు చేయాలని కోరారు. దళితులకు కేటాయించిన అసైన్డ్ భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని, అలాగే అంబేద్కర్ అభయహస్తం పేరిట రూ. 12 లక్షల ఆర్థిక సాయం అందించాలని ఆయన అన్నారు. 2018 నుంచి ఎస్సీ కార్పొరేషన్ రుణాలు నిలిపివేయడం జరిగిందని, తక్షణమే గ్రౌండ్ చేసిన రుణాలను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కుల వివక్ష, అంటరానితనం వంటి సమస్యలను అధ్యయనం చేసి, ప్రత్యక్ష ప్రతిఘట ఉద్యమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా, దళిత మహిళల హక్కులపై సెమినార్లు మార్చి 8న జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు పులిజాల అశోక్, మండల నాయకులు ముద్రమల్ల చంద్రయ్య, వింజమూరు దేవిడ్, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి బొల్లె జగన్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# గ్యాంగ్టక్‌లో లయన్స్ క్లబ్ జోన్ సోషల్ సమావేశం

**హైదరాబాద్, మార్చి 5(నీలగిరి ఎక్స్ ప్రెస్)** అస్సాం రాష్ట్రంలోని గ్యాంగ్టక్ లో లయన్స్ క్లబ్ జోన్ సోషల్ మీటింగ్ హర్షోల్లాసంగా జరిగింది. ఈ సమావేశంలో క్లబ్ సేవా ప్రాజెక్టులపై చర్చించారు. సామాజిక సేవలో లయన్స్ క్లబ్ చేస్తున్న కృషిని మరింత విస్తరించాలని, పేదలకు, అశక్తులకు అండగా నిలిచే కొత్త కార్యక్రమాలను ప్రారంభించాలని నిర్ణయం తీసుకున్నారు. సభ్యులంతా ఉత్సాహంగా పాల్గొన్న ఈ సమావేశం, లయన్స్ క్లబ్ నిబద్ధతను ప్రతిబింబించింది. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలతో సమాజానికి తోడుగా ఉండాలని ప్రతిజ్ఞ చేసి, సమావేశాన్ని విజయవంతంగా ముగించారు. సమావేశం అనంతరం లయన్స్ క్లబ్ మాజీ జిల్లా గవర్నర్ చెన్నకిషన్ రెడ్డి జన్మదిన వేడుకలను లయన్స్ క్లబ్బుం ఆఫ్గా ఆమనగల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన




సేవలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరింత సేవా కార్యక్రమాలకు ఆయన నేతృత్వం అవసరమని సభ్యులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు కండె సత్యం, గుర్రం కేశవులు, అర్థం మనోహర్, నటరాజ్ యాదయ్య, చంద్రశేఖర్, గుజ్జరి నర్సింహ, బిచ్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# రాయిని పేట ప్రాథమికోన్నత పాఠశాలలో ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



**కొత్తకోట,మార్చి 5( నీలగిరి ఎక్స్ ప్రెస్):** కొత్తకోట మండలము రాయనింగ్ పేట ప్రాథమికోన్నత పాఠశాలనందు బుధవారం విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారిగా కుమారి స్మైలీ, మండల విద్యాధికారిగా కుమారి మెహవిష్ , ప్రధానోపాధ్యాయులుగా కుమారి ముస్కాన్ పాత్రలు నిర్వహించి,మిగతా 13 మంది చిన్నారులు ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించారు. విద్యార్థులందరూ తమకు కేటాయించిన పీరియడ్స్ నందు చక్కగా ప్రిపేర్ అయ్యి పాఠ్యాంశాలు బోధించారు. విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ ఎమ్. శ్రీనివాసులు జిల్లా విద్యాశాఖ కోఆర్డినేటర్ యుగంధర్, ఉపాధ్యాయ బృందం వరలక్ష్మి, మాధవి, నరేష్ పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

# అమెరికాలో కేశంపేట యువకుడు మృతి

**-ఉన్నత చదువు కోసం అమెరికా వెళ్ళిన గంప ప్రవీణ్**
**-గన్ తో కాల్చడంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యుల ఆరోపణ**



**షాద్ నగర్, మార్చ్ 5(నీలగిరి ఎక్స్ ప్రెస్)**అమెరికాలోనీ మిల్వాంకివిస్కాన్సిన్ సిటీలో నివాసం ఉంటున్న రంగా రెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గంలోనీ కేశంపేట మండల కేంద్రానికి చెందిన గంప ప్రవీణ్ (27) బుధవారం తెల్లవారు జామున మృతి చెందాడు. ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లి అక్కడ ఎంఎస్ రెండవ సంవత్సరం చదువుతూ పార్ట్ టైంగా స్టోర్ లో జాబ్ చేస్తున్న ప్రవీణ్. మృతుడు నివాసం ఉండే ఇంటికి దగ్గర్లోని బీచ్ వద్ద గన్ తో కాల్చడంతో మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

# ఉచిత కుట్టుమిషన్ శిక్షణ

**-మహిళలకు ప్రత్యేక అవకాశం**

**కొల్లాపూర్, మార్చి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా మహిళా సాధికారత కేంద్రం ద్వారా ఉచిత కుట్టుమిషన్ శిక్షణ అందించబడుతోంది. ఈ శిక్షణ 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు కలిగిన ఆసక్తి గల మహిళల కోసం ప్రత్యేకంగా అందించబడుతోంది. ఈ శిక్షణలో చేరడానికి ఆసక్తి గల మహిళలు జిల్లా కేంద్రంలోని మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యాలయం (రూమ్ నంబర్ G 6), సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కొల్లాపూర్ చౌరస్తా, నూతన కలెక్టరేట్) వద్ద తమ ఆధార్ కార్డు మరియు పుట్టిన తేదీ ధృవపత్రాలతో దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేది 13 మార్చి 2025గా నిర్ధారించబడింది. మరిన్ని వివరాల కోసం 6304158868 లేదా 9553056594 నంబర్లను సంప్రదించవచ్చు. ఈ శిక్షణ మహిళలకు ఆర్థిక స్వావలంబనను అందించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఆసక్తి గల మహిళలు ఈ అవకాశాన్ని తప్పక వినియోగించుకోవాలని సంబంధిత అధికారులు సూచించారు.

# ఘనంగా సైన్స్ ఫెయిర్



**యాచారం,మార్చి 5 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )** యాచారం మండల పరిధిలో ని నందివనపర్తి ప్రభుత్వ పాఠశాలలో సైన్స్ పెయిర్ నిర్వహించారు. ఈ సైన్స్ ఫెయిర్ ను మండల విద్యాధికారి పాండురంగారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. విద్యార్థులు అనేక రకాల ప్రదర్శన లు తమ ప్రయోగాల రూపంలో ప్రదర్శించారు ఈ కార్యక్రమాన్ని మండల విద్యాధికారి పాండురంగారెడ్డి ఉపాధ్యాయులతో కలిసి వాటిని పరిశీలించారు . విద్యార్థిని విద్యార్థుల మనోవిజ్ఞానాన్ని అభినందించారు. విద్యార్థులు తమ సెన్స్ పరిజ్ఞానాన్ని మరింత పెంపొందించుకోవాలి కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు ఉన్నారు.


# జూపల్లి మాజీ సర్పంచ్ రంగినేని వాసుదేవరావు మృతి



**చారకొండ, మార్చి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** చారకొండ మండల పరిధిలోని జూపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ రంగినేని వాసుదేవరావు మరణం గ్రామస్తులకు తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఆయన విద్యావేత్తగా, రాజకీయ నాయకుడిగా గుర్తింపు సాధించడంతో పాటు, జూపల్లి గ్రామ అభివృద్ధికి విశేషంగా సేవలందించారు. రంగినేని వాసుదేవరావు హయాంలోనే జూపల్లి గ్రామంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చోటుచేసుకున్నాయి. ప్రత్యేకంగా, బ్యాంకు సేవలను ఇతర గ్రామాల కంటే ముందుగా జూపల్లిలో అందుబాటులోకి తెచ్చే కృషి ఆయనదే అని గ్రామస్తులు గుర్తుచేసుకుంటున్నారు. సేవా కార్యక్రమాల్లో ఆయన ముందుండేవారని, ఆయన మృతితో గ్రామం ఒక గొప్ప నాయకుడిని కోల్పోయిందని గ్రామస్తులు తెలిపారు. మండల యువసేన అధ్యక్షుడు ఎండి సిరాజ్, వాసుదేవరావు ఆత్మకు శాంతి చేకూర్చాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. భగవంతుడు వారి కుటుంబానికి మనోధైర్యాన్ని ప్రసాదించాలని కోరుకుంటూ, వాసుదేవరావు సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని తెలిపారు.

# రజక సంఘ భవన నిర్మాణానికి అనువైన చోట స్థలం కేటాయించండి

**-ప్రధాన కార్యదర్శి శాంత కుమారి ని కోరిన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**



**హైదరాబాద్, మార్చి 5(నీలగిరి ఎక్స్ ప్రెస్)**డా.బి. ఆర్. అంబేద్కర్ సచివాలయంలో షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంత కుమారి ని కలిసి గతంలో హైదరాబాద్ లో రజక సంఘం భవనం నిర్మాణానికి మేడిపల్లి గ్రామంలో భూమి కేటాయిస్తే ఆ స్థలం భవనం నిర్మాణానికి అనుకూలంగా లేదని తెలిపారు. కావున ఉప్పల్ బాగాయత్ లో స్థలం కేటాయించామని కోరారు. ఈ కార్యక్రమంలో వట్టికోటీ శేఖర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## పన్ను చెల్లించని భవనాన్ని సీజ్ చేసిన మున్సిపల్ అధికారులు



**కల్వకుర్తి, మార్చి 5(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
కల్వకుర్తి మున్సిపల్ పట్టణ పరిధిలో ఆస్తి పన్ను చెల్లించని మార్కండేయ భవనాన్ని మున్సిపల్ అధికారులు తాళాలు వేసి సీజ్ చేశారు. తెలంగాణ పురపాలక చట్టం 2019 ప్రకారం పట్టణ పరిధి లో ఎవరైనా ఆస్తి పన్ను చెల్లించకపోతే అట్టి భవనాలను సీజ్ చేస్తామని,మంచి నీటి సరఫరా చేసే కుళాయి కనెక్షన్లు తొలగిస్తామని మున్సిపల్ కమిషనర్ షేక్ మహమ్మద్ హెచ్చరించారు.కమర్షియల్ భవనాలు,ఫంక్షన్ హాల్స్,షాపింగ్ కాంప్లెక్స్ లు నిర్మించి ఆస్తి పన్ను చెల్లించని,మొండి బకాయి దారుల భవనాలను సీజ్ చేస్తామని అన్నారు.

## సమాచార హక్కు రక్షణ చట్టం రంగారెడ్డి జిల్లా వైస్ ప్రెసిడెంట్ గా మ్యాడం గోవర్ధన్ నియామకం



**ఇబ్రాహీంపట్నం,మార్చ్ 05 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
సమాచార హక్కు రక్షణ చట్టం రంగారెడ్డి జిల్లా వైస్ ప్రెసిడెంట్ గా మ్యాడం గోవర్ధన్ ని నియమించినట్లు ప్రెసిడెంట్ గజ్జి శ్యాం ప్రసాద్ రావు,వర్కింగ్ ప్రెసిడెంట్, భోజరాజు ప్రశాంత్, రాష్ట్ర జనరల్ సెక్రెటరీ కె.రాజు, జనరల్ సెక్రెటరీ చందమల్ల సుధాకర్ లు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా నియమింపబడ్డ రంగారెడ్డి జిల్లా వైస్ ప్రెసిడెంట్ మ్యాడం గోవర్ధన్ మాట్లాడుతూ నాపై ఎంతో నమ్మకంతో ఈ బాధ్యత అప్పజెప్పిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుతు ప్రస్తుత సమాజంలో యువతకి సమాచార హక్కు చట్టంపై అవగాహన లేదని దీనిపై నా వంతు నిరంతర కృషి చేస్తానని అన్నారు.చాలా ప్రభుత్వ కార్యాలయాలకు ఇప్పటికీ కూడా సమాచార హక్కు చట్టం బోర్డు లేకపోవడం శోచనీయమని, ప్రశ్నించే తత్వం సమాచార హక్కు చట్టానికి తోడు అవుతుందని నాపై ఉంచిన ఈ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని అన్నారు.

## కన్నుల పండుగగా పెద్ద రథోత్సవం..



**కల్వకుర్తి, మార్చి 5(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
కల్వకుర్తి నియోజకవర్గం వెల్దండ మండల పరిధిలోని గుండాల అంబారామలింగేశ్వర స్వామి ఆలయం దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందింది గుండాల అంబా రామలింగేశ్వర స్వామి ని దర్శించుకుంటే, సాక్షాత్తు కాశీ విశ్వేశ్వరున్ని దర్శించుకున్నట్లు భక్తులు భావిస్తారు. దేవాలయ ప్రాంగణంలో జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా బుధవారం తెల్లవారుజామున పెద్ద రథోత్సవం (పెద్ద తెరు) కన్నుల పండుగగా నిర్వహించారు.స్వామి వారి రథోత్సవం సందర్భంగా భారీగా భక్తులు తరలి రావడంతో గుండాల ప్రాంగణం కిటకిటలాడింది శివనామస్మరణల మధ్య అంబా రామలింగేశ్వర స్వామి మహారథోత్సవం కమనీయంగా జరిగింది. భక్తులు రథంపై పూలు విసిరి తమ మొక్కులు తీర్చుకున్నారు.

## మొదటి రోజు ప్రశాంతంగా సాగిన ఇంటర్ పరీక్షలు



**కల్వకుర్తి, మార్చి 5(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మొదలైన ఇంటర్ పరీక్షలు ప్రారంభం అయ్యాయి. కల్వకుర్తి మున్సిపల్ పట్టణంలో 07 సెంటర్లలో ఇంటర్ పరీక్షలు ఏర్పాటు చేశారు.మొదటి రోజు తెలుగు,హిందీ,ఉర్దూ భాషలలో పరీక్షలు నిర్వహించామని ఎగ్జామ్ చీఫ్ సూపరింటెండెట్ రాంరెడ్డి తెలిపారు మొదటి రోజు ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు సమయానికి చేరుకొని,పరీక్షలు రాశారు.పరీక్ష ముగిసిన తర్వాత విద్యార్థులు ఇబ్బంది పడకుండా పరీక్షలు రాశామని తెలిపారు.


# 42 శాతం రిజర్వేషన్ల అమలుకు బీసీ సంక్షేమ సంఘం డిమాండ్


**కల్వకుర్తి, మార్చి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కల్వకుర్తి పట్టణంలోని అమరజీవి వెంకటరెడ్డి మెమోరియల్ హాల్లో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బీసీలకు స్థానిక ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, బడుగు బలహీన వర్గాలను దృష్టిలో ఉంచుకుని కల్వకుర్తి నియోజకవర్గంలో రిజర్వేషన్ల రూపకల్పన చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీసీ సంఘం నాయకులు మాట్లాడుతూ, నీళ్లు, నియామకాలు, నిధుల అమలు వంటి అంశాల్లో బీసీలు ముందుండాలని, హాస్టల్లో నియామకాలు జరగాలని, ప్రతి విషయంలో బీసీ సంఘాలు కీలక పాత్ర పోషించాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న నిరంకుశ ధోరణిని రూపుమాపాలని, బడుగు బలహీన వర్గాలు ముందడుగు వేయలేకపోతున్నాయని విమర్శించారు. ఆర్. కృష్ణయ్య



58 సంవత్సరాలుగా బీసీ సంఘం ఆధ్వర్యంలో ఎన్నో ఉద్యమాలు నిర్వహించిన ఘనతను గుర్తుచేసుకుంటూ, ఉద్యమాల ఫలితంగా బీసీలు ముందంజలో ఉన్నారని పేర్కొన్నారు. సర్పంచుల కాలపరిమితి ముగిసినా ఇప్పటివరకు ఎన్నికలు నిర్వహించకపోవడం ప్రభుత్వ చిత్తశుద్ధి లోపాన్ని సూచిస్తుందని అన్నారు. బీసీలకు దమాషా ప్రకారం 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, ఇది ఎన్నికలతో పాటు అన్ని రంగాల్లో అమలు చేయాలని డిమాండ్ చేశారు. తూచా తప్పకుండా ఈ రిజర్వేషన్లు అమలు చేయాలని, లేకపోతే బీసీ సంఘం పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి మణికంఠ, ఓయూ జేఏసీ నాయకుడు రాజునేత, విద్యార్థి విభాగం రాష్ట్ర కన్వీనర్ భాస్కర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెద్ద యాదవ్, బీసీ సబ్ ప్లాన్ సాధన సమితి సభ్యులు, కల్వకుర్తి నియోజకవర్గ అధ్యక్షుడు మేకల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి






**– సిఐ కృష్ణంరాజు**

**యాచారం మార్చి 5 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
నిషేధిత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి... మద్యం సేవించే వాహనాలు నడపరాదని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు ఖచ్చితంగా హెల్మెట్ ధరించాల నిసిఐ కృష్ణంరాజు సూచించారు. హైదరాబాద్ గ్రీన్ ఫార్మసిటీ సిఐ కృష్ణంరాజు ఆధ్వర్యంలో మేడిపల్లి లో ఆన్లైన్ గేమ్స్ , డ్రగ్స్



గురించి చెడు వేసనాల గురించి పేకాట ఇతర వ్యసనాల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు . ఆన్లైన్ గేమ్స్ వల్ల యువత ఆత్మహత్య చేసుకుంటున్నారని గేమ్స్ అలవాటు పడవద్దు అన్నారు. అదేవిధంగా డ్రగ్స్ మరియు ఇతర మత్తు పానీయాలకు అలవాటు పడవద్దన్నారు . గ్రామంలోని ప్రజలతో . మాట్లాడి వాళ్ళ సమస్యలు అడిగి తెలుసుకున్నారు ఏ సమస్యలు వచ్చినా పోలీసు వ్యవస్థ అండగా ఉంటుందని తెలిపారు. సైబర్ నేర్ల పట్ల అవగాహన కలిగి ఉండాలని అన్నారు .ఈకార్యక్రమంలో హైదరాబాద్ గ్రీన్ ఫార్మసీ పోలీస్ స్టేషన్ చెందిన ఎస్ఐ తేజంరెడ్డి మరియు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

**కల్వకుర్తి, మార్చి 5(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని నాగర్ కర్నూల్ జిల్లా సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ గిరి కుమార్,ఎస్సై మాధవ రెడ్డి అన్నారు. కల్వకుర్తి మున్సిపల్ పట్టణంలోని స్థానిక గిరిజన బాలికల కళాశాల వసతి గృహంలో విద్యార్థులకు బుధవారం పలు విషయాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మొబైల్ ద్వారానే 80 శాతం సైబర్ నేరాలు జరుగుతున్నాయన్నారు. పెరుగుతున్న సాంకేతికతను ఆసరాగా చేసుకుని సైబర్ నేరాలకు కొందరు అక్రమాలకు పాల్పడుతు న్నారని విద్యార్థులు అవగాహన పెంచుకుని ఇటువంటి మోసాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చుట్టూ ఉన్న సమాజాన్ని కూడా జాగృతం చేయాలన్నారు.మహిళలు,చిన్న పిల్లలపై నేరాలు ఎక్కువయ్యాయన్నారు. విశృంకల



పాశావికమైన ఆలోచనల విధానాల వలన ఇటువంటివి చోటు చేసుకుంటున్నాయని, వీటి కట్టడికి చట్టాల ద్వారానే కాక మానవుల మనస్సుల్లో మార్పు రావాలన్నారు.బాల్య వివాహాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ, వాటిని అరికట్టేందుకు ప్రజలు సహకరించాలన్నారు.తెలియని వ్యక్తులకు వ్యక్తిగత సమాచారం ఓటీపీలు చెప్పరాదన్నారు. బాలికలపై అత్యాచారాలకు పాల్పడటం,బాల్య వివాహాల చేయడం, వారిని ప్రొత్సహించడం వంటివి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని,మొబైల్ వాడుతున్న విద్యార్థులు ఎక్కువుగా వాడరాదని అన్నారు. తెలియని యాప్,మెసెజ్ లు కూడా వాడొద్దని సూచించారు ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.

---

# గుర్రంపోడులో అఖిల భారత యాదవ మహాసభ

**– యాదవుల ఐక్యతపై పిలుపు**

**గుర్రంపోడు, మార్చి 5(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
గుర్రంపోడు మండల కేంద్రంలో నిర్వహించిన "అఖిల భారత యాదవ మహాసభ" సమావేశం విజయవంతంగా ముగిసింది. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షుడు ముచ్చర్ల ఏడుకొండలు యాదవ్, రాష్ట్ర నాయకుడు మరియు గొర్రెల కాపర్ల సంఘం అధ్యక్షుడు సోమనబోయిన సుధాకర్ యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సమావేశంలో యాదవుల రాజకీయ, ఆర్థిక, సామాజిక మరియు ఉద్యోగ రంగాల్లో అభివృద్ధి కోసం ఐక్యత అవసరమని నాయకులు స్పష్టం చేశారు. కుల బంధువుల సమస్యల పరిష్కారానికి అందరూ ఏకతాటిపై నిలబడి కృషి




చేయాలని పిలుపునిచ్చారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో యాదవులు సర్పంచులు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జడ్పీటీసీలుగా గెలుపొందేందుకు కృషి చేయాలని, పార్టీలకతీతంగా ఐక్యంగా పనిచేయాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు. ఈనెల 17న మండల కమిటీ ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ప్రకటించారు. గ్రామాల నుంచి మండలాల వరకు సంఘాన్ని బలోపేతం చేయాలని, యాదవులకు సంబంధించిన చైతన్యం తీసుకురావాల్సిన బాధ్యత అందరిపై ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జాల చిన్న సత్తయ్య యాదవ్, ఆవుల వెంకన్న యాదవ్, జక్కల భాస్కర్ యాదవ్, దాసరి యాదయ్య యాదవ్, నల్లబెట్టి పురుషోత్తం యాదవ్, దోటి చంద్రమౌళి యాదవ్, బొమ్ము శివ యాదవ్, రామలింగయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశం యాదవుల ఐక్యతను ప్రోత్సహిస్తూ, వారి అభివృద్ధి దిశగా ముందడుగు వేసే కార్యక్రమంగా నిలిచింది.

